# మందార మకరందాలు

-శ్రీవిరించి

**కా**ని అనూరాధ మాత్రం అలా అనుకోలేదు

❖❖❖

బజారు నుంచి రావడంతోటే అడగాలనుకున్నాడు కాని అంతలోనే మరేదో వ్యవహారం మనస్సును ఆకట్టు కుంది. తరువాత మరచిపోయాడు. గుర్తు రాకుండా మరుగున పడిపోయింది ఆ వ్యవహారం అంతా.

❖❖❖

ఇంటి దగ్గరే విశ్రాంతిగా కూర్చున్నప్పుడు ఇలాంటి విషయాలు చప్పున మనసులోకి రావు. ఏదో కదలిక వుంటే తప్ప ఇలాంటి విషయాలు ఒకంతట బయట పడవు. 'నాకు సంగీతం నేర్చుకోవాలని వుంది. వకుళా భరణం గారి దగ్గర' అన్నాడు.

❖❖❖

'రామారావు కనిపించాడు' అన్నాడు. ఆమె ముఖం లోకి చూచాడు. అతనికి కావలసిన మార్పు యేమీ దొరకలేదు.

ఒక నిమిషం ఆగి అతనే మళ్ళీ అన్నాడు. 'అతనికి సంగీతం నేర్చుకోవాలని వుంది. నీవేమో చెప్పనన్నా వుట కదా!'

'మీకు ఫిర్యాదు చేశాడన్న మాట!'

'ఫిర్యాదు కాదు, చెప్పాడు అంతే.'

'అతనికి సంగీతం ఎందుకట?' వకుళాభరణం గొంతులో కాస్త వ్యంగ్యం వుంది.

'నేను అడగలేదు, నాకెందుకని.'

❖❖❖

'ఈ మందారాలు యెక్కడివి?' అని అడిగాడు, యింటికి వస్తూనే. హాలులో యెదురుగుండా కని పిస్తున్నాయి. ఎర్రటి మందారాలు మూడు గుత్తులుగా. కళ్ళు చెదిరిపోయేంత ఎర్రదనం! పూర్వం కమలా ఫలాలు ఆ ఎరుపులో వుండేవి. ఇప్పుడు ఇటువంటి ఎరుపు రంగు కూడా అసామాన్యం అయిపోయింది.

'మీ మిత్రుడు రామారావు పంపించాడు. మీరు ఎర్ర మందారాలు గురించి మొన్న ఉపన్యాసం యిచ్చా రట గదా, అందుకు కృతజ్ఞతగా కావును!'

అతను ఆ మందారాలు చేతిలోనికి తీసుకున్నాడు. హాయి అనిపించింది. మనసుకు చాలా సేపటిదాకా.

❖❖❖

రామారావుకు ఉద్యోగం వుంది. ఆ ఉద్యోగం ఇన్ కంటాక్స్ లెక్కలకు సంబంధించింది గాని సంగీతానికి సాహిత్యానికి సన్నిహితమయినదేమీకాదు. అనూరాధకు సంగీతం రాకపోవడం తన దురదృష్టంగా భావిస్తు న్నాడు. ఆమె సంగీత కచేరీలకు కూడా రానంటుంది అదేం విడ్డూరమో గాని.

వకుళాభరణం మొదటిమారుగా యీ వూళ్ళో కచేరీ చేసినప్పుడు అతను దానికి హాజరయ్యాడు. కచేరీ అయిన తర్వాత ఆమె దగ్గరకు వచ్చి అభినందించాడు. మీలా సంగీతం పాడగలవాళ్ళు వుండడం ఈ ఊరికే గర్వకారణం-- అన్నాడు. ఆమె యేమీ బదులు చెప్ప లేదు. కృతజ్ఞతగా నవ్వి వూరుకుంది.

తరువాత అతను చాలా రోజులవరకూ కనపడ లేదు. సెలవు మీద వెళ్ళాను- అన్నాడు తరువాత కలిసి నప్పుడు. ఒకమారు మీ యింటికి వస్తాను, మీరు ఎప్పుడు తీరుబడిగా వుంటారు? అని అడిగాడు.

ఆదివారం నాడు రండి, వారు గూడా యింట్లో వుంటారు- అని బదులు చెప్పింది.

మళ్ళీ ఎన్ని గంటలకు- అని అడగలేదు, అతను.

సాయంత్రం నాలుగు గంటలకు వచ్చాడు.

వకుళాభరణం అతన్ని భర్తకు పరిచయం చేసింది. 'అప్పుడు కచేరీలో పలకరించారన్నానే, ఆ రామారావు గారు' అంది.

జనార్దనంతో చాలాసేపు మాట్లాడాడు, రామా రావు. ఎక్కువగా ఉభయ కుశలోపరి, లోకాభిరామాయ ణంతో సరిపోయింది. వకుళాభరణం సంగీతం తనకు చాల నచ్చిందన్నాడు. తాను సంగీతంలో ప్రవేశం లేని వాడే అయినా, ఎంతో అభిరుచి, ఆప్యాయత వున్న వాడినన్నాడు. అసలూ సంగీతం వల్లనే ప్రపంచం అంతా యింకా పూర్తిగా పాడు కాకుండా వుందన్నాడు.

❖❖❖

జనార్దనం, రామారావు మంచి స్నేహితులు అయ్యారు. వాళ్ళిద్దరూ దాదాపు ప్రతిరోజూ సాయం కాలం క్లబ్బులో కలుసుకునేవాళ్ళు. తరువాత అతన్ని గురించి ఆమె యెన్నడూ వినలేదు, అతని దగ్గర నుంచి.

ఒక సంవత్సరం గడిచిపోయింది. వకుళాభరణం

## ఇంటా బయటా "అమ్మో"

అమ్మ గురించి అనర్గళంగా మాట్లాడి శ్రోతలను
ఉద్రూతలూగించి,
వారిచేత "అమ్మో" ఎంత బాగా మాట్లాడేడో,
అనిపించగలడు.
ఇంటికి వచ్చి అమ్మను హింసించి ఆమె చేత కూడా
"అమ్మో" అనిపించగలడు.
కేవలం మాటలు చెప్పేవాడు,
ఊకదంపుడు ఉపన్యాసాలకు తప్ప,
మరెందుకు పనికొస్తాడు!

## ప్రకృతి ధర్మం

పలు కష్టాలు పడి, పట్నం చేరి, యిక బస్సెక్కడానికి
పైసలు పూజ్యమై,
నడిచి నడిచి అలసిపోయిన ఒక పాంథుడు,
దప్పికతో ఆశ్రయించాడు, ఒక వీధి కుళాయిని!
యథాప్రకారం, అక్కడ నీళ్లు లేవు!
దగ్గర్లో కంట పడింది, నేత్రానందంగా ఒక సర్కారు
పార్కు.
కాసేపు విశ్రమిద్దామని లోపలికి వెళ్ళబోయాడు!
పైసలు లేనిదే పార్కులోకి ప్రవేశం లేదన్నారు.
నీరసంగా వున్న నిరుపేదకు యీ యోగ్యత కూడా
లేదనుకుంటూ,
చతికిలపడ్డాడు, మోడువారిన ఒక చెట్టుకింద!
మోడువారగా మిగిలిన కాండం, కొంచెం
నీడనిచ్చి సేదతీర్చింది, నెచ్చలిలా!
మళ్ళీ నడక మొదలుపెడుతూ, ఆ మోడువారిన
చెట్టుకి కైమోడ్చాడు కృతజ్ఞతతో!
''నమస్కారం ఎందుకయ్యా! భూమిలో
పాతుకుపోయిన
నా వేళ్లలో యింకా కొంచెం ప్రాణం మిగిలి వుంది!
నేను చచ్చిపోతున్నా, నా ధర్మం నేను పాటిస్తూ,
పైసలాసించకుండా, మానవుల సేద తీరుస్తాను!"
అంటూ, ఒక అజ్ఞాత అక్షరధ్వని, విస్మయ పరుస్తూ,
వీనులవిందుగా వినపడింది!
"నీ నిరంతర సేవా తత్పరతకి, సరితూగవెన్ని
దండాలయినా" అంటూ మోకరిల్లాడు పాంథుడు,
శక్తివంచన లేకుండా.

-భమిడిపాటి సోమయాజి

టౌన్ హాల్‌లో కచేరీ చేయడం తటస్థించింది. అప్పుడు రామారావు మళ్లీ ఆమెను కలుసుకుని మంచిగా మాట్లాడాడు. సంగీతం అంటే తనకు వున్న అభిమానాన్ని పునర్వ్యక్తీకరించాడు.

'నాకు సంగీతం నేర్చుకోవాలని వుంది, కాని సమయం తక్కువ. వారానికి ఒకరోజు మాత్రం రాగలుగుతాను, మీరు దయచేసి నేర్పుతారా?' అని అడిగాడు.

'నాకు సంగీతం నేర్పడం రాదు' అంది వకుళాభరణం.

రామారావు ఆశ్చర్యంగా ఆమె వంక చూచాడు. నమ్మలేను అన్నట్లుగా.

'నిజం, సార్ పాడేవాళ్ళందరికీ పాడడం నేర్పించడం రాదు, సంగీతం నేర్పించడం, పాడడం కంటే ఎక్కువ కష్టం' అంది ఆమె. ఇంకా నమ్మలేను- అన్నట్లుగానే చూచాడు రామారావు.

అక్కడితో ఆ ఘట్టం ముగిసింది.

❖❖❖

జనార్దనానికి ఈ సంగతి చెప్పింది.

'పోనీ, నేర్పరాదూ- అతనంత ఉత్సాహంగా అడుగుతున్నాడు కదా!'

'నాకు నిజంగానే నేర్పడం రాదు. మీరు కూడా నమ్మలేకపోతున్నారా?'

'నాకూ ఈ విషయం కొత్తగానే అనిపిస్తోంది.'

'టీచర్స్ ట్రెయినింగ్ అయిన వాళ్ళు మాత్రమే చెప్పగలరు. బోధన అనగానే దానికి కొన్ని పద్ధతులూ వుంటాయి కదా? అవన్నీ తెలిసిన వాళ్ళు చెబితేనే అంతా పకడ్బందీగా వుంటుంది.'

రామారావుకు ఆమె మాటల్లో అపనమ్మకం లేకపోయినా, అది ఒకంతట మనసుకు పట్టలేదు. ఒక గురువు దగ్గర అయిదారు నెలలు నేర్చుకుని తరువాత సంగీత పాఠాలు చెప్పుకుంటూ బతుకుతున్నవాళ్ళను అతను అనేక మందిని ఎరుగును. అయినా అతను ఆమెతో వాదనకు దిగటానికి సిద్ధంగా లేడు.

❖❖❖

మందారాల విషయంలో జనార్దనం దాదాపు స్పెషలిస్టు. వాటి పెంపకం, అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందో అతనికి తెలిసినంత నేర్పుగా ఆ రాష్ట్రంలోనే మరెవరికీ తెలియదని పేరుంది.

అయితే వాటిలో మకరందం ఎలా చేరుతుందో అతనికి తెలియదు. అదంతా క్రిమి కీటకాలకు

సంబంధించిన విషయం, నాకేమీ ప్రమేయం లేదు- అంటాడు. తేనెటీగల సమాచారం ప్రత్యేక పరిశోధనలు చేసిన వాళ్ళే చెబుతారు ఆ సంగతి.

❖❖❖

'సంగీత మకరందం' అనే పుస్తకం నారద మహర్షి వ్రాశాడట. కాని అది ఎక్కడా లభ్యం కాదట! అన్నాడు ఒకరోజు రామారావు అతనితో.

'అవును, అనేక పాత పుస్తకాలు కాలగర్భంలో కలిసిపోయాయి.'

'నారదుడు గొప్ప విద్వాంసుడు. ఆయనే త్యాగ రాజు గారికి 'స్వరార్ణవం' అనే పుస్తకం యిచ్చాడట. ఆ తరువాతనే త్యాగరాజు గారు అంత గొప్ప విద్వాం సుడు కాగలిగాడు అని చరిత్రకారులు చెబుతారు.'

'అవును, నారదుడు గంధర్వుడు. సంగీతం గంధర్వ విద్య అని వాడుక' అన్నాడు జనార్దనం.

'సంగీతం నేర్చుకోలేని వాడి జన్మ వృథా!' అని నిట్టూర్చాడు రామారావు.

❖❖❖

ఇంటికి వచ్చినప్పుడు జనార్దనం యీ ప్రస్తావన తీసుకువచ్చాడు.

'అతనికి నిజంగానే ఎంతో ఇంటరెస్టు-సంగీతం అంటే.'

'కావచ్చును. అయినా మరో మాట. 'స్వరార్ణవం' ఒక పుస్తకం కాదు. సంగీతానికి సంబంధించిన బీజాక్ష రాలు నారదులవారు త్యాగరాజు నాలుక మీద రాసి వుంటారు. ఆయనను సంగీత సముద్రంలో ముంచి వుంటారు. ఆ సాగరంలో ఈత కొట్టటం ఎలాగో చెప్పి వుంటారు.'

'స్వరార్ణవం అంటే స్వరాల సముద్రం అనే గదా వాచ్యార్థం.'

'అవును. తరువాత రోజుల్లో దానిని గురించి చెప్పు కునేటప్పుడు, అదో పుస్తకంలాగా ప్రచారం అయింది, అంతే.'

ప్రతిదానికీ రూపం యిస్తే తప్ప మనం అర్థం చేసుకోలేం గదా!- అనుకున్నారు యిద్దరూ.

❖❖❖

'ఇంతకూ నువ్వు మాత్రం రామారావుకు ససేమిరా సంగీతం నేర్పనంటావు' అన్నాడు ఒక తీరిక రోజు జనార్దనం.

'మళ్ళీ మొదటికి వస్తే నేనేం చెప్పను?'

జనార్దనం రెట్టించలేదు.

'నాకు సంగీతం నేర్పిన మేష్టరు గారు చాల గొప్ప వాడు. నా పాటకు అంతా ఆయనే కారణం. ఆయనను తలుచుకోకుండా నేను యేరోజూ గడపను. గురుభక్తి లేక యే విద్యా రాణించదని పూర్వులు చెబుతారు.'

'రామారావు భక్తిలో నాకేం లోపం కనిపించదు' అన్నాడు జనార్దనం.

'అతన్ని నేనేం అనడం లేదు. నాకు నేర్పడం రాదు అంటున్నాను, అంతే.'

❖❖❖

వకుళాభరణానికి సంగీతం నేర్పిన మేష్టరు గారు గాత్ర సంగీతజ్ఞుడు కాదు. ఆయన వీణ మేష్టరు.

ఆరోజుల్లో 'వకుళాభరణం-వీణ మేష్టారూ' అని అందరూ విడ్డూరంగా చెప్పుకునేవాళ్ళు. అయినా వకుళాభరణం అవేవీ లెక్క చేయకుండా తన సంగీత సాధనమీద మటుకే దృష్టి నిలిపి కాస్తో కూస్తో నేర్చు కుంది.

అవి పాత రోజులు. ఇప్పుడు మళ్ళీ నలుగురి నోళ్ళలో పడడం వకుళాభరణానికి ఇష్టం లేదు.

❖❖❖

అనూరాధ 'సంగీతము చేత బేరసారములుడిగెన్' అన్న సూక్తి మీరు విన్నారా?' అని అడిగింది. రామారావు తల ఆడించాడు. తెలుసుననో, తెలియదనో ఆ జవాబు అర్థం చేసుకోవటానికి వీలుకాలేదు ఆమెకు. 'హాయిగా ఉద్యోగం పనులు చూచుకుంటూ కాలక్షేపం చేసుకోలేక ఇలాంటి వింత కోరికలు ఎందుకు?'

కొద్దిసేపు అయినాక ఆమె మళ్ళీ అడిగింది. 'ఆమెకు చెప్పడం రాదన్నదన్నారుగా. అయినా సంగీతం మీదేనా మీ యింటరెస్టు?'

'సంగీతం లేదు గనుక యింక, ఇంట-రెస్టే!' అన్నాడు అతను.

మకరందం లేని 'మకరం'గా మిగిలిపోవలసిందే నేను- అనుకున్నాడు, తన మనసులోనే. ■

## గొప్పోడు

పాతదై, మాసిపోయి అంచులు చిరిగిన
టెర్రివూల్ లాగు తొడిగినోడు పేదోడు.
రంగు వెలిసి, పీలికలై
దారాలు ధారలైన
జీన్స్ వేసినోడు గొప్పోడు.

**-మహమ్మద్ తహసీన్ అలి**